
సాక్షి జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం । 14 । నవంబర్ । 2023

పోరుగల్లు..!



- అగ్రనేతల ఆగమనం.. ఉమ్మడి జిల్లాలో హోరెత్తుతున్న ప్రచారం
- ప్రధాన పార్టీల అభ్యర్థులకు మద్దతుగా నేతలు
- వరుస సభలతో మారుమోగుతున్న ప్రచారం
- నేడు తొర్రూరులో సీఎం కేసీఆర్ సభ.. స్టేషన్‌ఘన్‌పూర్, మామునూరుకు రేవంత్‌రెడ్డి
- మరోవైపు బీజేపీ కేంద్రమంత్రులు.. 28 వరకు అగ్రనేతల సభలు

– సాక్షి ప్రతినిధి, వరంగల్

- వివరాలు 10లో▸

గరిష్టం/కనిష్టం
29.0° /22.0°

వాతావరణం
జిల్లావ్యాప్తంగా ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్న సమయంలో వాతావరణం ఆహ్లాదరకంగా ఉంటుంది. రాత్రి చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఘనంగా దీపావళి వేడుకలు



భూపాలపల్లి అర్బన్: జిల్లావ్యాప్తంగా ఆది, సోమవారాల్లో దీపావళి వేడుకలను ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఆదివారం రోజునే వ్యాపారులు కుటుంబసభ్యులతో సహా వేదపండితుల సమక్షంలో లక్ష్మీపూజలు నిర్వహించారు. కొంతమంది ఆదివారం, మరికొందరు సోమవారం కేదారీశ్వర వ్రతాలు నిర్వహించుకున్నారు. పండుగ సందర్భంగా ప్రతి ఇంటికి మామిడి, అరటి తోరణాలు ఏర్పాటుచేసి, విద్యుత్ దీపాలతో అంగరంగ వైభవంగా అలంకరించారు. చిన్న, పెద్ద తేడా లేకుండా నూతన వస్త్రాలను ధరించి కేదారీశ్వర వ్రతం ఎంతో వైభవోపేతంగా జరుపుకున్నారు.

టపాసుల మోత

జిల్లావ్యాప్తంగా టపాసుల మోత మోగింది. చిన్న, పెద్ద తేడాలేకుండా టపాసులు కాల్చారు. పెరిగిన బాంబుల ధరలతో ప్రజలు హడలెత్తారు.

కాళేశ్వరుడిని దర్శించుకున్న ఎలక్షన్ అబ్జర్వర్



కాళేశ్వరం: కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తేశ్వర స్వామిని కరీంనగర్ ఎలక్షన్ అబ్జర్వర్ యోగేష్ సుఖదేవ్(ఐఆర్ఎస్) కుటుంబసభ్యులు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకం చేశారు. అమ్మవారిని దర్శంచుకున్నారు. అనంతరం అర్చక స్వాములు స్వామివారి శేష వస్త్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదలు అందజేశారు.

బాధితులకు న్యాయం జరిగేలా పనిచేయాలి



భూపాలపల్లి: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా పోలీసు అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు. సోమవారం భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో సిబ్బంది నిర్వహిస్తున్న విధుల గురించి డీఎస్పీ రాములు, ఎస్సై స్వప్న కుమారిని అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లో కేసులకు సంబంధించిన ఫైళ్లు, పలు రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను ఓపికతో విని వాటిని పరిష్కరించాలన్నారు. ప్రజలకు న్యాయం చేసేలా కృషి చేయాలని సూచించారు. పోలీసు సిబ్బందికి తమ పరిధిలోని ప్రతి గ్రామంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజలతో మమేకమై, మరింత చేరువ కావాలని చెప్పారు. ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలన్నారు. స్టేషన్ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. పోలీస్‌స్టేషన్ సిబ్బంది విధి విధానాలను సూచించే 5ఎస్ విధానాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున విధుల్లో ఉన్న పోలీసులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎన్నికలకు సంబంధించిన తగు సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల నియమావళిని నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పక్కాగా అమలుచేయాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాములు, ఎస్సై స్వప్నకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

సకుటుంబ సపరివార సమేతంగా..

- అభ్యర్థుల తరఫున కుటుంబికుల ప్రచారం

బీజేపీ వాహనంపై దాడి

- కార్యకర్తల ఆందోళన

ఇందిర అఫిడవిట్‌లో తప్పిదం

- ఎన్నికల నిబంధనల మేరకు ఓకే..

వినయ్‌భాస్కర్ తప్పుడు అఫిడవిట్

- రిటర్నింగ్ అధికారికి బీజేపీ నేత ఫిర్యాదు

- వివరాలు 10లో▸

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం..

అందుకే ధైర్యంగా ఓట్లడిగేందుకు వచ్చాం

- తెలంగాణ కోసం పుట్టిందే బీఆర్ఎస్
- ఆనాడు రైతులకు నీళ్లు ఇవ్వక కాంగ్రెస్ సావగొట్టింది..
- 60ఏళ్ల గోదావరి జలాల కలను పెద్ది సుదర్శన్‌రెడ్డి సాకారం చేశారు
- పార్టీల వైఖరేంటి అన్నదానిపై ఆలోచన చేయండి
- అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్‌కు ఓటు వేయాలి
- నర్సంపేట బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో అధినేత కేసీఆర్





ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన నర్సంపేట అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి, సభకు హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు



నర్సంపేట: 'ప్రతీ ఇంటికి నల్లా నీళ్లు అందించి ఓట్లు అడుగుతామని ఆనాడు ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకున్నాం. నేడు ప్రతీ ఇంటికి కనెక్షన్ ఇచ్చాకే ఓట్లకు వచ్చాం. తెలంగాణ ప్రజల కోసమే బీఆర్ఎస్ పుట్టింది. నాడు ఉన్న తెలంగాణను కాంగ్రెస్ పార్టీ ఊడగొట్టింది' అని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని సర్వాపురంలో సోమవారం జరిగిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం మాట్లాడారు. కృష్ణా, గోదావరి నీళ్లు ఇవ్వక కాంగ్రెస్ పార్టీ ప్రజలను సావగొట్టిందన్నారు. 50ఏళ్ల కాంగ్రెస్ పాలనలో చేనేత ఆకలి చావులు, రైతుల ఆత్మహత్యలు, విద్యుత్ సమస్యలు ఉండేవన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కావాల్సిన పరిణతి రాలేదని, గ్రామాల్లో నిజా నిజాలపై చర్చ పెట్టాలన్నారు. వ్యవసాయం బాగుండాలని శపథం పట్టామని, తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక విభిన్న పథకాలు అమలు చేస్తున్నామన్నారు. 60ఏళ్ల కలను పెద్ది సుదర్శన్‌రెడ్డి సాకారం చేసి గోదావరి జలాలు తెచ్చాడని, యాసంగిలో 1.35 లక్షల ఎకరాల పంటలు సాగవుతున్నాయని తెలిపారు. తెలంగాణలో నీటి తీరువాలు తొలగించామన్నారు. పార్టీల వైఖరేంటో ఆలోచన చేసి ఓటు వేయాలన్నారు. సీసాలతో వచ్చే వారికి ఓటు వేయద్దని తెలిపారు. నర్సంపేటలో 270 చెరువులు గోదావరి జలాలతో నింపామన్నారు. అభివృద్ధి కొనసాగాలంటే, తెలంగాణ పెడదారి పట్టొద్దంటే పెద్ది సుదర్శన్‌రెడ్డిని, బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలన్నారు. నర్సంపేట ప్రాంతం హత్యలతో ఉండేదని, పదేళ్ల కాలం నుంచి ప్రశాంతంగా ఉంటుందన్నారు. తెలంగాణ రాక ముందు తలసరి ఆదాయంలో 19వ స్థానంలో ఉంటే నేడు మొదటి స్థానంలో నిలుస్తోందన్నారు. పెద్ది సుదర్శన్‌రెడ్డిని గెలిపిస్తే పాకాల, రంగాయ చెరువు కాల్వలను బాగు చేసుకుందామని, నర్సంపేటకు రింగ్ రోడ్డును ఏర్పాటు చేయిద్దామన్నారు. దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా తెలంగాణ రాష్ట్రాన్ని తీర్చిదిద్దామని, ప్రతీ ఇంటికి నల్లా నీళ్లు అందించి ఓట్లు అడుగుతామని ఆనాడు ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకొని నేడు ప్రతీ ఇంటికి కనెక్షన్ ఇచ్చాకే ఓట్లకు వచ్చామన్నారు. రైతుల సంక్షేమం కోసమే రైతుబంధు, 24 గంటల విద్యుత్, రైతు బీమా, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే ప్రతిపక్షాలు ఓర్వలేకనే దుబారా చేస్తున్నామని ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం ఏదైనా.. మీ ఎమ్మెల్యే కరెక్టుగా ఉండాలన్నారు.

నా ఆస్తి మీరే.. నా బలగం మీరే : పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి



మాట్లాడుతున్న అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేటలో తాను కాంట్రాక్టులు చేయడం లేదని, దందాలు, సెటిల్‌మెంట్లు అసలే తెలియవని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. నా జీవితం నర్సంపేట నియోజకవర్గ ప్రజలతోపాటు కేసీఆర్‌కు అంకితమని, నిత్యం మీ వెంట, మీ వద్దే ఉంటున్నానన్నారు. కరోనా సమయంలో పారిపోయినోళ్లంతా ఎన్నికలు రాగానే జనాల మధ్యకు వచ్చి ఓట్లు అడుగుతున్నారని, అలాంటి వారి మాటలు ప్రజలు నమ్మి మోసపోవద్దన్నారు. నర్సంపేట నియోజకవర్గ ప్రజలకు తాను నిజం తెలుపుతున్నానని, ఈ విషయం కొంత మందికే తెలుసని పెద్ది అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పోలీసుల చేతిలో లాఠీ దెబ్బలు తిన్నానని, ఉద్యమ సమయంలోనే కుడి కన్ను పోగొట్టుకున్నానని తెలిపారు. ఉద్యమ సమయంలో తగిలిన గాయాలతో నాకు నిత్యం అనారోగ్య సమస్యలు వస్తూనే ఉంటాయని, నిత్యం ఫిజియోథెరపీ చేసుకుంటానని, ఇన్ని సమస్యలు ఉన్నా ప్రజల కోసమే పరితపిస్తుంటానని ఆయన తెలిపారు. కొంత మంది తాను నమస్కారం చేయనని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీన్ని ప్రజలు ఎవరూ నమ్మవద్దని కోరారు. సభలో మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీలు మాలోతు కవిత, పసునూరి దయాకర్, ఎమ్మెల్సీలు బండా ప్రకాశ్, మధుసూదనాచారి, ఎన్నికల ఇన్‌చార్జ్, జనవనరుల కార్పొరేషన్ చైర్మన్ వి.ప్రకాశ్, మాజీ ఎంపీ సీతారాంనాయక్, జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, జెడ్పీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్న, మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని, వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, నాయకులు రాయిడి రవీందర్‌రెడ్డి, నల్ల మనోహర్‌రెడ్డి, రాణాప్రతాప్‌రెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం..

నర్సంపేట రూరల్: ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు నర్సంపేట నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధి నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు భారీగా తరలివచ్చారు. దీంతో పట్టణమంతా గులాబీమయమైంది. కళాకారులుతమ ఆట పాటలతో సభికులను ఉత్తేజ పరిచారు. ఖమ్మం జిల్లానుంచి బయలుదేరిన సీఎం కేసీఆర్ 4.44 నిమిషాలకు నర్సంపేటలోని హెలిపాడ్ వద్దకు చేరుకోగా.. సభలో ప్రసంగించిన అనంతరం 5.25 నిమిషాలకు తిరుగు పయనమయ్యారు. సీఎం కేసీఆర్ ప్రసంగంతో గులాబీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఏసీపీలు, సీఐలు, ఎస్సైలతో పాటు ప్రత్యేక పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఒక నామినేషన్ తిరస్కరణ

- 25మంది అభ్యర్థులవి ఓకే..



నామినేషన్ పత్రాలను పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

భూపాలపల్లి: భూపాలపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరించారు. సోమవారం భూపాలపల్లి అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల పరిశీలకులు అబయ్ నందన్ అబస్త, పోలీస్ అబ్జర్వర్ అమిత్‌కుమార్, ఎమ్మెల్యే అభ్యర్థుల సమక్షంలో అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి రమాదేవి పరిశీలించారు. నియోజకవర్గానికి సంబంధించి 26 నామినేషన్లు దాఖలు కాగా యుగ తులసి పార్టీ అభ్యర్థి శివకృష్ణకు 25 ఏళ్లు ఉండగా అర్హతకు తక్కువగా ఉండటంతో తిరస్కరించారు. మిగిలిన 25 మంది అభ్యర్థుల నామినేషన్లు సరిగా ఉన్నట్లు ప్రకటించారు.

మంథనిలో నాలుగు తిరస్కరణ

కాటారం: మంథని అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో నాలుగు నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు మంథని రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ హనుమనాయక్ సోమవారం తెలిపారు. నియోజకవర్గంలో 28 మంది 48 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. అభ్యర్థులు, వారి ప్రతినిధుల సమక్షంలో సోమవారం పరిశీలన చేసినట్లు రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు. పలు కారణాలతో బహుజన్ సమాజ్ పార్టీ తరఫున నామినేషన్ వేసిన చల్ల సుజాత, బీఆర్ఎస్ పార్టీ తరఫున నామినేషన్ వేసిన పుట్ట శైలజ, స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలుచేసిన చంద్రుపట్ల రాంరెడ్డి, రొడ్డ వంశీకృష్ణ నామినేషన్లు తిరస్కరించినట్లు 24మంది అభ్యర్థుల నామినేషన్లు అంగీకరించబడినట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు.

ప్రచారంతో ఉపాధి

- జనసమీకరణకు నాయకుల ఆర్భాటం
- రోజువారి కూలీలే టార్గెట్



భూపాలపల్లి అర్బన్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కార్యకర్తలు తక్కువ కాకుండా రాజకీయపార్టీల నాయకులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రచారంతో కార్యకర్తలు తక్కువగా ఉంటే రోజువారీ కూలీలను ఉపయోగించుకుంటున్నారు. దీంతో కూలీలకు కూడా ఉపాధి దొరుకుతుంది. కూలీలకు రోజువారి డబ్బులతో పాటు భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. బతుకమ్మ, డప్పులతో స్వాగతం పలికే వారికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు.

జిల్లాలో అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు గ్రామాల్లో, పట్టణాల్లో తిరుగుతూ ప్రజలను ఓట్లు అడుగుతున్నారు. వివిధ కాలనీల్లో తిరుగుతూ ప్రజలు తమను ఆశీర్వదించాలని కోరుతున్నారు. ఈ రకంగా ప్రచారాల్లో దూసుకెళ్తూ, తమ వెంట ఉండే కార్యకర్తలు, శ్రేణులు తక్కువ కాకుండా చూసుకుంటున్నారు. అన్ని చోట్లా జనసమీకరణకు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నారు. కొన్నిచోట్ల కార్యకర్తల సంఖ్య పలుచగా ఉన్నట్లు భావిస్తే రోజువారీ కూలీలను రంగంలోకి దింపుతున్నారు. ముఖ్యంగా రోజు వారి కూలీలతో ఉపాధి పొందుతున్న వారిని ప్రచారంలో భాగం చేస్తున్నారు. వీరికి రోజు వారి కూలి చెల్లించడంతో పాటు భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. మగవారికైతే రోజుకు రూ.300, మహిళలకు రూ.200 చొప్పున చెల్లిస్తూ ప్రచారానికి వాడుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ ధోరణి తక్కువగా ఉన్నప్పటికీ, మండల, పట్టణాల్లో కేంద్రాల్లో ఇటువంటి ప్రచార పరిస్థితులు ఎక్కువగానే ఉన్నాయి.

జనసమీకణకు ప్రాధాన్యత..

ఎన్నికల ప్రచారానికి తమ నాయకుడు వస్తున్నాడని తెలుసుకుంటున్న ద్వితీయశ్రేణి నాయకులు జనసమీకరణపై దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా ప్రచారంలో జనాలు తక్కువగా కాకుండా తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జనం తగ్గితే తనపై నమ్మకం కోల్పోతుందనే ఉద్దేశంతో జనసమీకణకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో ప్రచారంలో రోజువారి కూలీలను కూడా వదిలేయకుండా డబ్బులు చెల్లించి ప్రచార కార్యక్రమాలకు వినియోగించుకుంటున్నారు.

చాలామందికి ఉపాధి

అసెంబ్లీ ఎన్నికల పుణ్యమా అని వివిధ రాజకీయ పార్టీలు నిర్వహిస్తున్న ప్రచారం చాలామంది కూలీలకు ఉపాధి కల్పిస్తుంది. డప్పుచప్పుల్ల నుంచి డీజేల దాకా, కోలాటం నుంచి బతుకమ్మ దాకా ప్రతి ఒక్కరికీ చేతి నిండా పని దొరుకుతుంది. ప్రస్తుతం జిల్లాలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఏ గ్రామంలో పర్యటించాలని భావించినా డప్పు చప్పుల్లు, కోలాటం లాంటివే అవసరం అవుతున్నాయి. ఈ ఏర్పాట్లు లేనివే ప్రచారంలో జోష్ కన్పించడం లేదు. దీంతో వీరికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. వీటన్నింటికీ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని వివిధ రాజకీయపార్టీల కార్యకర్తలు మాట్లాడుకుంటున్నారు.

విద్యార్థులకు నీళ్ల చారే దిక్కు



నీళ్ల చారును వడ్డిస్తున్న సిబ్బంది

ఎస్ఎస్ తాడ్వాయి: మండల పరిధిలోని బయ్యక్కపేట గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు సోమవారం నీళ్ల చారుతోనే భోజనం వడ్డించారు. పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని కార్మికులు తయారు చేశారు. మొదట దోసకాయ కూర వడ్డించిన వర్కర్లు కూర అయిపోవడంతో మారన్నం వేసుకున్న విద్యార్థులు నీళ్ల చారుతో భోజనం చేయాల్సిన దుస్థితి నెలకొంది. పాఠశాలలో ఎక్కువగా ఆదివాసీ గొత్తికోయ పిల్లలు చదువుకుంటున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనానికి సరిపడా కూర వండాల్సి ఉండగా అరకొరగా దోసకాయ కూర వండటంతో రెండో సారి అన్నం పెట్టుకున్న విద్యార్థులకు నీళ్ల చారుతోనే సరిపెట్టారు. దీపావళి సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు లేకపోవడం గమనార్హం. సుమారు 50 మంది విద్యార్థులకు భోజనం వడ్డించినట్లు సిబ్బంది తెలిపారు. ఎక్కువగా ఆదివాసీ గొత్తికోయ పిల్లలే పాఠశాలలో ఉండటంతో వారికి హెచ్‌ఎంను ప్రశ్నించే ధైర్యం లేకపోవడంతో ఇష్టారీతిన చాలిచాలని కూరలతో భోజనం పెడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మారుమూల ప్రాంతంలో ఆశ్రమ పాఠశాల ఉండటంతో అధికారులు ఎవరు కూడా అటువైపుగా వెళ్లిన దాఖలాలు లేవు. దీంతో పాఠశాల నిర్వాహకులే భోజనం విషయంలో మెనూ పాటించకుండా వారు నిర్ణయించిన కూరలు మాత్రమే వండిపెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు సరైన భోజనం అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

అభ్యర్థులు వారే.. గుర్తులు మారే


బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియ


కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య

బయ్యారం : ఇల్లందు నియోజకవర్గ పరిధిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు గత ఎన్నికల్లో పోటీ చేసిన వారే. అయినప్పటికీ వారి గుర్తులే మారాయి. స్థానిక ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున.. కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య బీఆర్ఎస్ తరఫున పోటీచేశారు. ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా హరిప్రియ.. కాంగ్రెస్ అభ్యర్థిగా కోరం కనకయ్య పోటీలో ఉండటంతో గుర్తులు మారాయి తప్ప అభ్యర్థులు మారలేదని ఓటర్లు చెబుతున్నారు.

పై'చేయి' కోసం ప్రచారం..

మామ తరఫున కోడలు..

జనగామ : కాంగ్రెస్ జనగామ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తరఫున కోడలు దివ్య, కూతురు సాయి ప్రియాంకరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మామ, తండ్రి గెలుపు కోసం పార్టీ శ్రేణులతో కలిసి కాంగ్రెస్ ఆరు గ్యారంటీ పథకాలను వివరిస్తూ చేయి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.


జనగామలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రతాప్‌రెడ్డికి మద్దతుగా కోడలు, కూతురు ప్రచారం

భర్త తరఫున భార్య..

జనగామ: బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి తరఫున ఆయన సతీమణి నీలిమ ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. పార్టీ శ్రేణులతో కలిసి సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రస్తుతం ప్రకటించిన మేనిఫెస్టో గురించి వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


ఇంటింటి ప్రచారం చేస్తున్న పల్లా సతీమణి నీలిమ

జంగ్ తెలంగాణ

తండ్రి తరఫున తనయుడు..

వర్ధన్నపేట: బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి అరూరి రమేశ్ తరఫున అతడి తనయుడు విశాల్ విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నాడు. ఇందులో భాగంగా వర్ధన్నపేటలో పట్టణ ఇన్‌చార్జ్ పాలకుర్తి శ్రీకాంత్‌తో పాటు యువకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నాడు. ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన అభ్యర్థించాడు.


వర్ధన్నపేటలో ప్రచారం చేస్తున్న విశాల్

సకుటుంబ సపరివార సమేతంగా..

అభ్యర్థుల తరఫున కుటుంబీకుల ప్రచారం

- గడపగడపకూ వెళ్తూ గెలిపించాలని వేడుకోలు
- సందడిగా మారుతున్న పల్లెలు, పట్టణాలు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కీలక ఘట్టం నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. ఆయా పార్టీల తరఫున అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అనంతరం ప్రచార పర్వం ప్రారంభించగా ప్రస్తుతం ఊపందుకుంది. ఈ సందర్భంగా అభ్యర్థుల తరఫున కుటుంబీకులు పార్టీ శ్రేణులతో కలిసి విస్తృత ప్రచారం చేపడుతున్నారు. తండ్రి కోసం తనయులు, సోదరుల తరఫున తోబుట్టువులు, మామ కోసం కోడలు, భర్త కోసం భార్య.. ఇలా సకుటుంబ సపరివార సమేతంగా ప్రచార పర్వంలో భాగస్వాములవుతున్నారు. ఇందులో భాగంగా పల్లె నుంచి పట్టణం వరకు గడపగడపకూ వెళ్తున్నారు. ఆశీర్వదించి అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను వేడుకుంటున్నారు.

– సాక్షి నెట్‌వర్క్





గండ్ర వెంకటరమణారెడ్డి తరఫున కుటుంబీకులు..


రేగొండ మండలంలో ప్రచారం చేస్తున్న గండ్ర జ్యోతి

భూపాలపల్లి అర్బన్ : బీఆర్ఎస్ భూపాలపల్లి అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డితో పాటు తన సతీమణి జ్యోతి, కుమారుడు గౌతమ్‌రెడ్డి కూడా ప్రచారంలో పాల్గొంటున్నారు. గండ్ర జ్యోతి కొత్తపల్లిగోరి మండలం చిన్నకోడెపాక, బాలయ్యపల్లి, విజ్జయ్యపల్లి, రాజక్కపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధితో పాటు బీఆర్ఎస్ హామీలు, ఎన్నికల మేనిఫెస్టోను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

ప్రహ్లాద్ తరఫున పద్మ..

తమ్ముడి కోసం అక్క ప్రచారం..

వెంకటాపురం(ఎం): బీజేపీ ములుగు ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా ప్రహ్లాద్ తరఫున అతడి అక్క అజ్మీరా పద్మ (మాజీ మంత్రి చందూలాల్ కూతురు) శనివారం మండలంలోని కేశవాపురం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. తన తండ్రి చందూలాల్ హయాంలోనే ములుగు జిల్లా అన్ని విధాలా అభివృద్ధి చెందిందని, ప్రహ్లాద్ గెలుపుతో మరింత అభివృద్ధి సాధ్యమని ప్రచారం చేస్తున్నారు. ప్రజలు ఆశీర్వదించి ప్రహ్లాద్‌ను గెలిపించాలని కోరారు.


కేశవాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రహ్లాద్ సోదరి పద్మ

తండ్రి గెలుపు కోసం తనయుడి..

నర్సంపేట: కాంగ్రెస్ పార్టీ నర్సంపేట అభ్యర్థి దొంతి మాధవరెడ్డి గెలుపు కోసం తనయుడు దొంతి అవియుక్త్‌రెడ్డి ప్రచారం నిర్వహిస్తున్నారు. యువసేన ఏర్పాటు చేసుకొని తండ్రి గెలుపు కోసం విస్తృత ప్రచారం చేపడుతున్నారు.


తండ్రితో కలిసి ప్రచారంలో పాల్గొన్న అవియుక్త్‌రెడ్డి

మంత్రి ఎర్రబెల్లి .. సతీమణి


మాట్లాడుతున్న ఉషాదేవి

పాలకుర్తి టౌన్: బీఆర్ఎస్ పాలకుర్తి నియోజవర్గ అభ్యర్థి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు మద్దతుగా ఆయన సతీమణి ఉషాదేవి ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పాలకుర్తి నియోజకవర్గంలో మంత్రిగా దయాకర్‌రావు చేసిన అభివృద్ధిని వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారు.

సత్యనారాయణరావు తరఫున భార్య, కూతుళ్లు

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావుతో పాటు తన సతీమణి పద్మ, కూతుళ్లు అశ్విని, అనూష ప్రచారంలో భాగస్వాములు అవుతున్నారు. పద్మ భూపాలపల్లి, గుడాడ్‌పల్లిలో, కూతుళ్లు చిట్యాల మండలం చల్లగరిగే, జూకల్ గ్రామాల్లో చేతి గుర్తుకు ఓటేయాలని ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు.


భూపాలపల్లి మండల కేంద్రలో ప్రచారం చేస్తున్న గండ్ర పద్మ

'పెద్ది' గెలుపు కోసం సతీమణి..

నర్సంపేట: బీఆర్ఎస్ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్‌రెడ్డి గెలుపు కోసం తన సతీమణి, జెడ్పీ ఫ్లోర్ లీడర్ స్వప్న ప్రచారం నిర్వహిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని బతుకమ్మ ఆటలతో గ్రామాల్లో విస్తృతం ప్రచారం చేస్తున్నారు.


బతుకమ్మలతో ప్రచారంలో పెద్ది స్వప్న

'దాస్యం' గెలుపు కోసం కుటుంబీకులు..

హన్మకొండ: బీఆర్ఎస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి దాస్యం వినయ్ భాస్కర్ విజయం కోసం కుటుంబీకులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. వినయ్ భాస్కర్ సతీమణి రేవతి, తన కూతురు, కుమారుడితోపాటు, సోదరుడు విజయ్ భాస్కర్, మాజీ మంత్రి ప్రణయ్ భాస్కర్ కుమారుడు, కార్పొరేటర్ అభినవ్ భాస్కర్, బంధువులు కాలనీల్లో ఇంటింటికి వెళ్తున్నారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్‌ను గెలిపించాలని కోరుతున్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న దాస్యం వినయ్‌భాస్కర్ సతీమణి రేవతి

కోడలు కోసం అత్త ప్రచారం..


పాలకుర్తి ప్రచార సభలో మాట్లాడుతున్న హనుమండ్ల ఝాన్సీరెడ్డి

పాలకుర్తిటౌన్: పాలకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి మామిడాల యశస్వినిరెడ్డి తరఫున ఆమె అత్త హనుమండ్ల ఝాన్సీరెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలు వివరిస్తూ కోడలు యశస్వినిరెడ్డికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

'నాయిని' తరఫున కుటుంబీకులు..


బొట్టుపెట్టి ప్రచారం చేస్తున్న 'నాయిని' సతీమణి నీలిమా రెడ్డి, కుటుంబీకులు

హన్మకొండ: కాంగ్రెస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి నాయిని రాజేందర్ రెడ్డి విజయం కోసం ఆయన కుటుంబీకులు ఉధృత ప్రచారం నిర్వహిస్తున్నారు. రాజేందర్ రెడ్డి సతీమణి నీలిమా రెడ్డి, కూతురు గోదారెడ్డి, అల్లుడు విష్ణువర్ధన్ రెడ్డి, బంధువులు వివిధ కాలనీల్లో పాదయాత్ర చేస్తూ ప్రతి ఇంటికి వెళ్లి రాజేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతున్నారు.

ప్రదీప్‌రావు తరఫున భార్య, కోడలు..

వరంగల్: బీజేపీ వరంగల్ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు తరఫున ఆయన భార్య రేణుక, పెద్ద కోడలు స్రవంతి ఎలక్షన్ క్యాంపెయిన్ చేపడుతున్నారు. ఇందులో భాగంగా 12వ డివిజన్‌లోని దేశాయిపేట, డాక్టర్స్ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ప్రదీప్‌రావును భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా చేనేత కార్మికుల వద్ద వెళ్లి రేణుక నూలు రాట్నం వడికారు.


నూలురాట్నం వడుకుతున్న ప్రదీప్‌రావు సతీమణి రేణుక

తండ్రి గెలుపు కోసం తనయ..


ప్రచారం నిర్వహిస్తున్న తేజస్వి

మహబూబాబాద్ అర్బన్ : మానుకోట జిల్లా కేంద్రంలోని 15వ వార్డు సుందరయ్య నగర్, బీ.టీ.ఆర్ నగర్, రెడ్యానాయక్ కాలనీల్లో ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్ నాయక్ తరఫున ఆయన తనయురాలు తేజస్వి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కారు గుర్తుకు ఓటు వేసి శంకర్ నాయక్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

పతి కోసం సతి..

మహబూబాబాద్ రూరల్ : కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ భూక్యా మురళీనాయక్ గెలుపు కోరుతూ ఆయన సతీమణి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ భూక్యా ఉమ నియోజకవర్గంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. హస్తం గుర్తుకు ఓట్లు వేసి మురళీనాయక్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.


మానుకోటలోని ఓ టిఫిన్ సెంటర్ వద్ద ప్రచారం చేస్తున్న ఉమ

అఫిడవిట్‌లో తప్పిదం

- ఎన్నికల నిబంధనల మేరకు ఒకే

స్టేషన్‌ఘన్‌పూర్ : కాంగ్రెస్ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ అభ్యర్థి సింగపురం ఇందిర తన నామినేషన్‌తో పాటు దాఖలు చేసిన అఫిడవిట్‌లో తప్పిదం చోటుచేసుకుంది. ఇందిర తన అఫిడవిట్‌లో నేషనల్ కాంగ్రెస్ పార్టీ ఎదురుగా ఉన్న కాలంలో అప్లికేబుల్ బదులు నాట్ అప్లికేబుల్ అని పూరించారు. ఈ విషయమై సోమవారం ఆర్ఓ కార్యాలయంలో జరిగిన స్క్రూటినీలో బీజేపీ అభ్యర్థి విజయరామారావుతో పాటు స్క్రూటినీలో పాల్గొన్న ఇతర అభ్యర్థులు ఆర్ఓతో చర్చించారు. అయితే ఎన్నికల నిబంధనల మేరకు ఏ పార్టీ నుంచి బీ–ఫారం జతచేస్తారో దానినే పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల నియమావళి మేరకు ఆమె నామినేషన్‌ను ఆమోదించామని తెలిపారు.

వినయ్‌భాస్కర్.. తప్పుడు అఫిడవిట్

హన్మకొండ: బీఆర్ఎస్ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ తప్పుడు అఫిడవిట్ దాఖలు చేశారని బీజేపీ నాయకుడు, న్యాయవాది రావు అమరేందర్‌రెడ్డి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. ప్రజాప్రతినిధుల కేసులు విచారిస్తున్న ప్రత్యేక కోర్టు జరిమానా విధించిందని, ఈ జరిమానాను చెల్లించాడని, రూ.2 వేలకు పైగా జరిమానా చెల్లిస్తే ఎన్నికల్లో పోటీకి అనర్హుడవుతాడని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే బీఆర్ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ తాను రూ.1,000 మాత్రమే జరిమానా చెల్లించినట్లు అఫిడివిట్‌లో చూపించారని ఫిర్యాదులో తెలిపారు. తప్పుడు అఫిడవిట్ దాఖలు చేసిన వినయ్‌భాస్కర్ నామినేషన్‌ను తిరస్కరించాలని ఫిర్యాదులో కోరారు. ఈసందర్భంగా రావు అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ పశ్చిమ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పారదర్శకంగా విధులు, బాధ్యతలు నిర్వహించడం లేదని ఆరోపించారు. రూ.3 వేలు జరిమానా విధించిన జడ్జిమెంట్ ప్రతిని, జరిమానా చెల్లించినట్లు ఆధారాలు అందించినా.. బీఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్‌పై చర్యలు తీసుకోకుండా ఆమోదించారని, దీనిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

బీజేపీ అభ్యర్థి వాహనంపై రాళ్ల దాడి


ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ధర్మసాగర్ : ఎన్నికల ప్రచారంలో భాగంగా స్టేషన్ ఘన్‌పూర్ నియోజక వర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుండె విజయరామారావు ఆదివారం మండలంలోని సోమదేవరపల్లిలో ప్రచారం నిర్వహించారు. కాగా, బీజేపీ వాహనంపై గుర్తుతెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేసి కారు అద్దాలు పగులగొట్టారు. దీంతో ఆ పార్టీ నాయకులు సోమదేవరపల్లిలో రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా విజయరామారావు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎదుర్కోలేక ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. భౌతిక దాడులకు భయపడేది లేదని బీఆర్ఎస్ నాయకులు చేసిన అవినీతిని ప్రజలకు వివరిస్తామని పేర్కొన్నారు. ఈ క్రమంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దాడి చేసిన వ్యక్తులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు గంకిడి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు చిలుక విజయరావు, గంకిడి వెంకట్‌రెడ్డి, పూల శ్రీనివాస్, శ్రీరాముల విజయ్, దాసరి సదానందం పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన

- బీఆర్ఎస్ నాయకుల బహిరంగ ప్రమాణం


కురవి: సీరోలులో ప్రమాణం చేస్తున్న కార్యకర్తలు

కురవి : బీఆర్ఎస్ నాయకులు బాహాటంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన సంఘటన సోమవారం మహబూబాబాద్ జిల్లా సీరోలు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు, కార్యకర్తలు పార్టీ వీడుతారేమోనన్న భయమో? ఓట్లు తక్కువగా వస్తాయి అనే అనుమానమో? కానీ, మొత్తానికి సొంత పార్టీ శ్రేణులతో బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మక్క గోపయ్య ఆధ్వర్యంలో సీరోలు గ్రామ బొడ్రాయి సెంటర్ వద్ద బహిరంగంగా ప్రతిజ్ఞ చేయించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డీఎస్ రెడ్యానాయక్‌కు ఓట్లు వేసి మెజార్టీ తీసుకు రావాలని ప్రమాణం చేయించారు. కాగా ఈ ప్రమాణం చేయించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కోడ్ ఉల్లంఘనపై అధికారులు ఏం చేస్తారో వేచిచూడాల్సిందే.








పోరుగల్లు..!

- అగ్రనేతల ఆగమనం.. ఉమ్మడి జిల్లాలో హోరెత్తుతున్న ప్రచారం
- ప్రధాన పార్టీల అభ్యర్థులకు మద్దతుగా నేతలు
- వరుస సభలతో మార్మోగుతున్న ప్రచారం
- నేడు తొర్రూరులో సీఎం కేసీఆర్ సభ.. స్టేషన్‌ఘన్‌పూర్, మామునూరుకు రేవంత్‌రెడ్డి
- మరోవైపు బీజేపీ కేంద్రమంత్రులు.. 28 వరకు అగ్రనేతల సభలు

సాక్షిప్రతినిధి, వరంగల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓరుగల్లు రాజకీయ పార్టీల పోరుగల్లుగా మారింది. ప్రధాన రాజకీయ పార్టీల అగ్రనేతల ప్రచార సభలతో హోరెత్తుతోంది. ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అగ్రనేతలు.. అభ్యర్థుల గెలుపు కోసం సర్వశక్తులొడ్డుతున్నారు. రోడ్ షోలు, బహిరంగ సభలు, విమర్శలు, ప్రతి విమర్శలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. గెలుపే లక్ష్యంగా ఓవైపు అభ్యర్థులు నిత్యం నియోజకవర్గాల్లో అలుపెరగకుండా తిరుగుతుండగా.. మరోవైపు జోష్ పెంచేందుకు అగ్రనేతలతో బహిరంగసభలు నిర్వహిస్తున్నారు. సోమవారం నామినేషన్ల పరిశీలన అనంతరం.. ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ బరిలోనే ఉన్నారు. రేపు (బుధవారం) నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం కూడా ముగియనుండటంతో పోరు మరింత ఉధృతం కానుంది.

ఎన్నికల షెడ్యూల్ నుంచే మొదలైన ప్రచారం..

ఎన్నికల షెడ్యూల్ విడుదలనుంచే ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచారానికి శ్రీకారం చుట్టాయి. బీఆర్ఎస్ అభ్యర్థులను ముందే ప్రకటించడంతో ఈ విషయంలో ఆ పార్టీ ముందంజలో ఉంది. చాలాచోట్ల బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు ఈ నెల 5 వరకు ఖరారు కాక ఆశావహులందరూ ప్రచారంలో ఉన్నారు. నోటిఫికేషన్ విడుదలనుంచి అభ్యర్థులు తేలడంతో అన్ని పార్టీల వారు ప్రచారంలో నిమగ్నమయ్యారు. అక్టోబర్ 16న ఉమ్మడి వరంగల్‌లో తొలి ప్రచారసభను జనగామలో నిర్వహించిన సీఎం కేసీఆర్ ఇప్పటికే నాలుగు నియోజకవర్గాల్లో పర్యటించారు. అక్టోబర్ 18న ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, టీపీసీసీ, సీఎల్‌పీ నేతలు రేవంతర్ రెడ్డి, భట్టి విక్రమార్కలు ములుగు, భూపాలపల్లి నియోజకవర్గాల్లో బస్సు యాత్ర నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర చీఫ్ కిషన్‌రెడ్డి, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, కేంద్రమంత్రులు అనురాగ్‌ఠాకూర్, అశ్వినికుమార్ చౌబే తదితరులు ఉమ్మడి వరంగల్‌లోని పలు నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించారు. అగ్రనేతల ద్వారా సభలు, ర్యాలీలు నిర్వహించి జనంలోకి వెళ్తే మరింత ఆదరణ లభిస్తుందన్న వ్యూహంతో అన్ని పార్టీలు ముందుకు సాగుతున్నాయి.

ఓరుగల్లు బాటలో అగ్రనేతలు..

ఉమ్మడి వరంగల్‌లో ప్రచారం హోరెత్తించేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు అగ్రనేతలతో వరుస సభలకు ప్లాన్ చేశాయి.

- సోమవారం వరంగల్ జిల్లా నర్సంపేటలో సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ అభ్యర్థి పెద్ది సుదర్శన్ రెడ్డి గెలుపు కోసం ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. మంగళవారం పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరులో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గెలుపు కోసం కేసీఆర్ సభ నిర్వహించనున్నారు. 17న పరకాలలో, ఆ తర్వాత మూడు రోజులకు అంటే 20న స్టేషన్ ఘన్‌పూర్‌లో, ఆ మర్నాడే డోర్నకల్‌లో, 24వ తేదీన ములుగు, భూపాలపల్లిలో, 27న చివరగా వరంగల్ తూర్పు, పశ్చిమతో ముఖ్యమంత్రి సభలు పూర్తి కానున్నాయి.
- ఇప్పటికే ములుగు, భూపాలపల్లి, పాలకుర్తి నియోజకవర్గాల్లో సభలు నిర్వహించిన టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి మంగళవారం స్టేషన్ ఘన్‌పూర్, వర్ధన్నపేట నియోజకవర్గం మామునూరులో ఆ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం బహిరంగసభలు నిర్వహించనున్నారు. ఈ నెల 27 వరకు కూడా ఉమ్మడి జిల్లాలో ర్యాలీలు, కార్నర్ మీటింగ్‌లలో పాల్గొననున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.
- ఉమ్మడి జిల్లాలో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా బీజేపీ నేతలు ముందుకు సాగుతున్నారు. జూలైలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హనుమకొండ బహిరంగ సభలో పాల్గొనగా, ఆ పార్టీ తరఫున జాతీయ స్థాయి అగ్రనేతలు ఓరుగల్లులో పర్యటిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, కేంద్రమంత్రులు అనురాగ్‌ఠాకూర్, అశ్వినికుమార్ చౌబే, ప్రచార సారథి ఈటల రాజేందర్, బండి సంజయ్‌లు ప్రచారం నిర్వహించగా.. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాలు కూడా నామినేషన్ల ఉప సంహరణ తర్వాత ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.
- ఏదేమైనా ఉమ్మడి వరంగల్‌లో ఆయా పార్టీల అగ్రనేతల ప్రచారంతో ఎన్నికల పోరు క్లైమాక్స్ చేరుకుంటుంది.